## క్లుప్తంగా

### పేదల ఆశాజ్యోతి కాట్రగడ్డ వెంకటనారాయణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదల ఆశాజ్యోతి కాట్రగడ్డ వెంకటనారాయణ అని పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. స్థానిక సత్యనారాయణ పురం భగత్‌సింగ్ రోడ్డులో ఆదివారం కాట్రగడ్డ వెంకటనారాయణ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన కాట్రగడ్డ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాట్రగడ్డ చేసిన సేవలను కొనియాడారు. నేడు భౌతికంగా ఆయన లేనప్పటికీ ప్రతీ ఒక్కరి హృదయాల్లో ఎన్నటికీ నిలిచే ఉంటారని అన్నారు. కార్యక్రమంలో గాంధీ, కమ్మిలి రత్నకుమార్, సామంతపూడి చిన్నా, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### వెలంపల్లి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం



పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం 62వ డివిజన్ 81వ బూత్ పరిధిలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు అలంపూరు విజయ్, రామిరెడ్డి, బోరా బుజ్జి, చంటి, హైమావతి, సుభాని, డివిజన్ ఇన్‌చార్జి మస్తాన్ తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి బ్రోచర్లు అందజేశారు.

### సీజనల్ పండ్లు, ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీజనల్ పండ్లు, ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణుడు డాక్టర్ కోనా వీరబ్రహ్మం సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద శిబిరం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయుర్వేదం, హోమియో చికిత్సతో అన్ని రకాల వ్యాధులను ఎటువంటి సైడు ఎఫెక్టులు లేకుండా నయం చేయవచ్చని అన్నారు. వేసవి ఎండలు పెరుగుతున్న దృష్ట్యా పల్చటి కాటన్ వస్త్రాలు ధరించాలని, ఎండల్లో తిరగకూడదని తెలిపారు. వడదెబ్బ తగిలితే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. అనంతరం 350 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు.

### అంకమ్మతల్లి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీలోని శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

### నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పిఠాపురానికి చెందిన భక్తులు ఆదివారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. పిఠాపురంకు చెందిన ఎస్. సత్యనారాయణ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ పర్యవేక్షకులు జగదీష్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

# పార్కుగా.. పాయకాపురం చెరువు

- పాయకాపురం ప్రాంత వాసులకు ఆరోగ్యం, ఆహ్లాదం
- రూ. 3.71 కోట్లతో చక్కటి సదుపాయాలు



వైఎస్సార్ పార్కుగా రూపుదిద్దుకున్న పాయకాపురం చెరువు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పాయకాపురం చెరువు నిన్న మొన్నటి వరకు చెత్తా, చెదారం, ముళ్ల పొదలతో దర్శనమిచ్చేది. కాలు తీసి కాలు పెట్టడానికి వీల్లేని పరిస్థితి. పశువులు సంచరించేవి. కొంత భాగం ఆక్రమణలకు గురైంది. చుట్టూ ఆవాసాలు ఉండటంతో చెరువులో తరచూ ప్రమాదాలు జరిగేవి. కానీ ఇప్పుడు పాయకాపురం చెరువు రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. చెరువు ఆవరణ చక్కని పార్కుగా రూపుదిద్దుకుంది. ప్రమాదాల నివారణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఆవరణ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం జరిగింది. చెరువు ఆవరణ అంతటా పచ్చదనం పరుచుకుంది. వాకింగ్ ట్రాక్‌లు, విద్యుత్ వెలుగులు, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు అందుబాటులోకి వచ్చాయి. పాయకాపురం చెరువు దర్శనీయ ప్రదేశంగా రూపుదిద్దుకుంది.

**సకల సౌకర్యాలతో వైఎస్సార్ పార్కు..**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగర వాసులకు ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని అందించేందుకు పార్కులను అభివృద్ధి చేసింది. అనువైన ప్రదేశాల్లో నూతన పార్కులను నిర్మించింది. ఎక్కడికక్కడ అనువైన ప్రదేశాలను గుర్తించి సుందరంగా తీర్చిదిద్దింది. ఉదయం, సాయంత్రం వేళల్లో కాలనీల వాసులు సేదతీరేలా చక్కటి సదుపాయాలతో పార్కులను తీర్చిదిద్దింది. ఇందులో భాగంగా నగరంలోని 61వ డివిజన్ పరిధిలోని పాయకాపురం చెరువును నగరపాలకసంస్థ పార్కుగా అభివృద్ధి చేసింది. అస్తవ్యస్తంగా ఉన్న చెరువును అందమైన పార్కుగా రూపొందించి వైఎస్సార్ పార్కుగా నామకరణం చేసింది. సకల సౌకర్యాలు కల్పించింది. మొత్తం రూ. 3.71 కోట్లతో అద్భుతమైన పార్కు రూపుదిద్దుకుంది. చెరువు కట్ట చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించారు. పార్క్‌లో పచ్చటి మైదానాలు, వాటి మధ్య కూడా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. పిల్లలు, పెద్దలు ఆడుకునేందుకు వీలుగా బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. చెరువులోనే పిల్లలకు బోటింగ్ సదుపాయం కల్పించేందుకు కార్పొరేషన్ ఏర్పాట్లు చేసింది. దీంతో పాయకాపురం, వాంబే కాలనీ వాసులకు చక్కటి పార్కు అందుబాటులోకి వచ్చింది. ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానికులతో సందడి వాతావరణం నెలకొంటుంది. పచ్చిక బయళ్లపై చిన్నారులు కేరింతలు కొడుతున్నారు. నిన్న మొన్నటి వరకు అస్తవ్యస్తంగా ఉన్న చెరువు, దాని ఆవరణం అద్భుతమైన పార్కుగా రూపుదిద్దుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చెరువు కట్ట చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్



పార్కు లోపల అందమైన లాన్, మధ్యలో వాకింగ్ ట్రాక్

### చక్కగా తీర్చిదిద్దారు



పాయకాపురం పరిసరాల్లో గతంలో పార్కులు లేవు. చెరువు అధ్వానంగా ఉండేది. ఇప్పుడు పార్కు ఏర్పాటుతో ఈ ప్రాంత వాసులకు మేలు జరిగింది. చెరువును పార్కుగా తయారు చేస్తారనుకోలేదు. చక్కగా తీర్చిదిద్ది సౌకర్యాలు మెరుగు పరిచారు.

– సీహెచ్ నాగమణి, స్థానికురాలు

### డివిజన్‌కు మణిహారం



పాయకాపురం నిర్లక్ష్యం కారణంగా కుచించుకుపోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెరువు అభివృద్ధిపై దృష్టి సారించింది. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పార్కును అభివృద్ధి చేశారు. సకల సదుపాయాలు కల్పించారు. చెరువు కట్టపై పూల మొక్కలు వేసి రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. వైఎస్సార్ పార్క్ ఈ ప్రాంతానికి మణిహారంగా నిలుస్తోంది.

– నాశం బాబు, స్థానికుడు

## నేత్ర పర్వంగా సాగిన కూచిపూడి నృత్యాలు



కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తున్న నృత్య కళాకారులు

విజయవాడ కల్చరల్: దృశ్యవేదిక నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు నేత్ర పర్వంగా సాగాయి. కూచిపూడి నాట్యాచార్యుడు సీహెచ్ అజయ్‌కుమార్ బృందం కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించారు. గణపతి స్తుతితో ప్రారంభించి ఆనందనర్తనం, రామచంద్రుని ప్రార్థిస్తూ రాముడు రాఘవుడు, భామనే సత్యభామనే, సూర్యాష్టకం అంశాలను ప్రదర్శించారు. జాహ్నవీ సుస్మ, నవ్యసువర్ణ, షేక్ బింబిత, భానుశ్రీ, తానియాసిరి, పుష్కర సౌమ్య, చైత్ర, శ్రీదేవి, మృదుల, మేఘన నృత్య కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా హర్ష క్రియేషన్స్ విజయవాడ వారి స్వర్ణకమలాలు సాంఘిక నాటికను ప్రదర్శించారు. అభ్యుదయ భావాలు కలిగిన ఓ రచయిత తన భావాలకు దగ్గరగా ఉండే పల్లెటూరి అమ్మాయిని వివాహం చేసుకుంటాడు. ఆమెకు శిక్షణ నిచ్చి ఒక రచయిత్రిగా తయారు చేస్తాడు. సహజంగా ప్రతిభ కలిగిన ఆ రచయిత్రి సమాజంలో గుర్తింపు తెచ్చుకుంటుంది. అది సహించలేని ఆ రచయిత ఆమెను వేధింపులకు గురి చేస్తాడు. ఆమె అతడిలోని మానవత్వాన్ని మేలుకొలిపి సమాజంలో బాధ్యత కలిగిన రచయితగా నిలబెడుతుంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవినేని కిషోర్‌కుమార్ దృశ్యవేదిక కార్యక్రమాలను అభినందించారు. సంస్థ సభ్యులు నాట్యాచారిణి పద్మశ్రీ హేమంత్, రమేష్, బొర్రా నరేన్ కార్యక్రమాలను నిర్వహించారు.



స్వర్ణకమలాలు నాటకంలోని సన్నివేశం

### నేడు 61, 62 డివిజన్లలో ఎమ్మెల్యే వెలంపల్లి పర్యటన

పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు ఎన్నికల పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం 61వ డివిజన్ వాంబే కాలనీ హెచ్ బ్లాక్ నందు పర్యటిస్తారని కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సాయంత్రం 62వ డివిజన్‌లో పర్యటిస్తారు. స్థానిక కార్పొరేటర్లు, పార్టీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు వెలంపల్లితో కలిసి పర్యటనలో పాల్గొంటారని తెలిపారు.

### 9న బాబా మందిరంలో ఉగాది వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడులోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఈ నెల 9వ తేది మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సరం(ఉగాది) వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు సంవత్సర ప్రారంభం ఉగాది పర్వదినం పురస్కరించుకుని మందిరంలోని బాబావారికి, దత్తాత్రేయ, వినాయక, ఆంజనేయస్వాములకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు ఉగాది వేడుకల్లో పాల్గొని బాబావారిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు.

## కళాకారులు సాంస్కృతిక రాయబారులు



సినీ సంగీత విభావరిలో మాట్లాడుతున్న టీవీ నటుడు అప్పారావు, వేదికమీద చిట్టిబాబు, డేవిడ్‌రాజు తదితరులు

విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక రాయబారులని టీవీ నటుడు అప్పారావు అన్నారు. జేఎమ్ఎస్ సరాగాలు ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళా వేదికమీద ఆదివారం సినీ సంగీత విభావరి కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన అప్పారావు మాట్లాడుతూ కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. సీనియర్ గాయకుడు కే డేవిడ్‌రాజు మాట్లాడుతూ గాయనీ గాయకులకు, కళాకారులకు వేదిక కల్పించాలని సూచించారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు డీవీ వీరభద్రరావు, చింతకాయల చిట్టిబాబు, పరచూరి విజయలక్ష్మి, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గాయని ఝాన్సీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

### దేశ రాజకీయాల్లో యువత ప్రముఖ పాత్ర

కృష్ణలంక(విజయవాడతూర్పు):దేశ రాజకీయాల్లో యువత ప్రముఖ పాత్ర పోషించాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఐఓ) రాష్ట్ర అధ్యక్షుడు రోషన్ అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి. విజ్ఞాన కేంద్రంలో ఎస్ఐఓ ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్ఐఓ గెట్ టు గెదర్ కార్యక్రమం నిర్వహించారు. రోషన్ మాట్లాడుతూ దేశంలో యువత ఎక్కువగా ఉందన్నారు. దేశ రాజకీయాలను శాసించే స్థాయిలో ఉన్న యువత ఓటు ద్వారా ప్రభుత్వం ఏర్పాటులో భాగస్వాముల కావాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హయాంలో దేశంలోని ముస్లింలపై దాడులు పెరిగాయని, వాటిని అరికట్టేందుకు బీజేపేతర ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## హలీం...టైం




రంజాన్ మాసం నేపథ్యంలో విజయవాడలోని వించిపేట పరిసరాలు హలీం సెంటర్లతో రద్దీగా మారాయి. సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు సందర్శకులతో హలీం కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. హలీం ప్రియుల రాకతో ఈ ప్రాంతమంతా సందడిగా మారుతుంది. పాతబస్తీలో పెద్ద సంఖ్యలో హలీం దుకాణాలు ఏర్పాటుచేశారు. హలీమ్, కబాబ్, ఫలుదా, వివిధ రకాల బిర్యానీలను నగరవాసులు ఆస్వాదిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







## మరణాన్ని గెలిచిన సజీవుడు ఏసుక్రీస్తు



చర్చిలో ఫాస్టర్ నుంచి ఆశీర్వాదం పొందుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

పాయకాపురం(విజయవాడరూరల్): ఏసుక్రీస్తు మరణాన్ని గెలిచిన సజీవుడని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 62వ డివిజన్ జీసస్ క్రాస్ చర్చిలో ఆదివారం జరిగిన ఈస్టర్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. మానవాళి రక్షణ కోసం సిలువలో మృతి చెందిన ఏసుక్రీస్తు మూడో రోజు మరణాన్ని గెలిచి జీవాధిపతిగా ఉన్నారని పేర్కొన్నారు. చర్చి ఫాస్టర్ ప్రభుకుమార్ ప్రత్యేక ప్రార్థన చేసి వెలంపల్లికి ఆశీర్వాదం అందజేశారు. స్థానిక పార్టీ నాయకులు అలంపూరు విజయ్, రామిరెడ్డి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు. అనంతరం 63వ డివిజన్‌లో జీసస్ పెంతెకోస్తు చర్చినందు, రాధానగర్ చర్చిలో కూడా వెలంపల్లి పాల్గొని ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు పసుపులేటి యేసు, సీహెచ్ రవి, టిక్యం కృష్ణ, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



అంబేడ్కర్ కాలనీలోని సీయోను ప్రార్థన మందిరంలో బైబిల్‌ను అందజేస్తున్న రెవరెండ్ వరప్రసాద్

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని మధురానగర్, ముత్యాలంపాడు, అయోధ్యనగర్, అంబేడ్కర్‌కాలనీ, దేవీనగర్, శాంతినగర్, బసవతారకనగర్, గులాబీతోట తదితర ప్రాంతాల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో విశ్వాసకులు చర్చిలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. అంబేడ్కర్ కాలనీలోని సీయోను ప్రార్థన మందిరంలో రెవరెండ్ డాక్టర్ కనమాల వరప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేసి విశ్వాసులకు బైబిల్ అందజేశారు. రామకృష్ణాపురం ఫుల్ గాస్పెల్ మినిస్ట్రీస్ చర్చిలో రెవరెండ్ డాక్టర్ వీ డానియేల్, మధురానగర్ జీసస్ ప్రేయర్ ఫెలోషిప్ చర్చిలో ఎన్టీఆర్ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు ఈస్టర్ విశిష్టతను వివరించారు. ఏసుక్రీస్తు చూపిన మార్గంలో పయనించాలని శాంతి, సేవాగుణం అలవర్చుకోవాలని సూచించారు. పెద్ద సంఖ్యలో విశ్వాసకులు ప్రార్థనలు చేసి క్రీస్తు గీతాలను ఆలపించారు.

## అరండల్‌పేట మసీదులో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గం 25వ డివిజన్ అరండల్‌పేటలోని మస్జిద్ ఎ హజరత్ మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మసీదు నందు ఆదివారం ఇఫ్తార్ విందు జరిగింది. ఈ ఇఫ్తార్ విందులో సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు ముస్లిం సోదరులతో కలిసి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం సోదరుల చేత ఉపవాస దీక్ష విరమింపజేశారు. వారికి పండ్లు తినిపించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం సోదరులకు అన్ని రంగాల్లో పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులపై అల్లా ఆశీస్సులు ఉండాలని కోరారు. విందులో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, నాయకులు మొహమ్మద్ రఫీ, అబ్దుల్ నజీర్, మస్జిద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

**పశ్చిమ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి**



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ బృందాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పశ్చిమ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి సూచించారు. ఆదివారం భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని కరకట్ట సౌత్, స్వాతి థియేటర్ రోడ్డు, మసీద్ రోడ్డులో సీఐఎస్ఎఫ్, సివిల్ పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న ఏసీపీ మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఓటు విలువైనదని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల్లో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చేసేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ప్రజలు పూర్తిగా సహకరించాలన్నారు. ఫ్లాగ్ మార్చ్‌లో సీఐ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## చురుగ్గా యూజీడీ పైపులైన్ పనులు



పంపింగ్ స్టేషన్ నుంచి పైపులైన్ వేస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ గద్దే వెంకట్రామయ్యనగర్ ఆచంట వెంకటరత్నంనాయుడు సర్కిల్‌లోని యూజీడీ పంపింగ్ స్టేషన్, సంపు నుంచి యూజీడీ పైపులైన్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే డివిజన్‌లోని గద్దే వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లో అంతర్గత పైపులైన్ పనులు పూర్తయ్యాయి. యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. దీంతో పంపింగ్ స్టేషన్ నుంచి అజిత్‌సింగ్‌నగర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు కలిపేందుకుగాను పైపులైన్‌లు వేస్తున్నారు. సాధ్యమైనంత త్వరలోనే పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువస్తామని అధికారులు చెబుతున్నారు.

## శాంతియుతంగా జాగార పర్వదినాలు



సమావేశంలో ఏసీపీ మురళీకృష్ణారెడ్డి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రంజాన్ పండుగలో అత్యంత కీలకమైన జాగారం పర్వదినాలను శాంతియుత వాతావరణంలో జరుపుకొందామని వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి తెలిపారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మసీదు పెద్దలతో ఏసీపీ ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి నుంచి జాగారం పర్వదినాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వివాదాలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు మత పెద్దలు సమన్వయం పాటించాలని కోరారు. మసీదు పరిసరాలతో పాటు కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సున్నితమైన ప్రాంతాల్లో ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో కొత్తపేట సీఐ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి ఉచిత పాలిసెట్ శిక్షణ తరగతులు

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 1 నుంచి 25వ తేదీ వరకు పాలిసెట్–2024 ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ. పద్మావతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం ఈ నెల 27న పాలిసెట్ పరీక్ష జరగనున్నట్లు పేర్కొన్నారు.